సాక్షి కుమురం భీం

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.

8లో▸

రంజాన్ వేళలు

మంగళ : ఇఫ్తార్ 6:31

బుధ : సహర్ 4:46

గరిష్టం/కనిష్టం 40.8 /28.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వా వేడి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో శిక్షణ కోసం ఆసక్తి గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ తెలంగాణ రాష్ట్ర సహకారంతో 38 వృత్తి శిక్షణ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. కాస్మటాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూ వీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ అండ్ డీటీపీ, ఎల్‌ఎంవీ డ్రైవర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అభ్యర్థులు గోలేటి 1ఏ లోని వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

7న ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో(మోడల్ స్కూల్స్) 6 నుంచి పదో తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 7న ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10 తరగతులకు సంబంధించి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు పరీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



రోగిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

సిర్పూర్(టి): కుష్ఠు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సోమవారం కుష్ఠు వ్యాధిగ్రస్తులు, అనుమానితులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠుపై అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకుని చికిత్స పొందాలన్నారు. గ్రామాల్లో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లెప్రసి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌నాయక్, డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మానిటరింగ్ ఆఫీసర్ శ్యామ్‌లాల్, డాక్టర్ నవత, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, సూపర్‌వైజర్లు పద్మావతి, సునతి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అధికారుల అడ్డగింత

- రోడ్డు నిర్మాణానికి అనుమతివ్వాలని సర్కేపల్లి గ్రామస్తుల డిమాండ్



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

వాంకిడి(ఆసిఫాబాద్): అటవీశాఖ అనుమతుల పేరుతో నిలిపివేసిన సర్కేపల్లి రహదారి నిర్మాణానికి అనుమతి ఇస్తే ఫారెస్ట్ అధికారులను ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించేందుకు ఒప్పుకుంటామని, లేనిపక్షంలో ప్రతిరోజూ అడ్డుకుంటామని సర్కేపల్లి గ్రామస్తులు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా అటవీ అధికారులు సోమవారం మండలంలోని సర్కేపల్లి అడవులకు వెళ్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మూడేళ్ల క్రితం మంజూరైన రహదారి పనులను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోని పక్షంలో మారెపల్లి, ఆలిగూడ, పాక్టిగూడ, సర్కేపల్లి గ్రామస్తులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కాగా.. మూడేళ్ల క్రితం పీఎం గ్రామీణ సడక్ యోజన కింద ఖమాన నుంచి సర్కేపల్లి వరకు 9 కిలోమీటర్ల బీటీ రోడ్డు మంజూరైంది. రూ.7 కోట్ల వ్యయం పనులు చేపట్టగా 6 కి.మీ. మాత్రమే పూర్తి చేశారు. అనుమతి లేదని మారెపల్లి నుంచి సర్కేపల్లి వరకు మూడు కి.మీ. మేర రోడ్డు పనులు నిలిచిపోయాయి.



మూడు రాష్ట్రాల పోలీసుల సమావేశంలో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్ (ఫైల్)

హై అలర్ట్!

- వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తం
- పార్లమెంట్ ఎన్నికలకు పటిష్ట భద్రత
- సరిహద్దు జిల్లాల పోలీసులతో సమావేశం

చింతలమానెపల్లి(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 'హై అలర్ట్' వాతావరణం కనిపిస్తోంది. జిల్లా భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

సరిహద్దులు కీలకం

కుమురం భీం జిల్లా చుట్టూ మహారాష్ట్ర సరిహద్దుగా ఉంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని కెరమెరి, వాంకిడి, సిర్పూర్(టి) నియోజకవర్గంలోని కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల మండలాలు చంద్రపూర్ జిల్లా సరిహద్దుగా చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు గడ్చిరోలి జిల్లాను సరిహద్దులుగా కలిగి ఉన్నాయి. వాంకిడి మీదుగా, సిర్పూర్(టి) మండలం పోడ్సా, హుడ్కిలి మీదుగా చంద్రపూర్‌కు రోడ్డు మార్గం ఉంది. చింతలమానెపల్లి మండలం గూడెం నుంచి గడ్చిరోలి జిల్లా అహేరికి రోడ్డు మార్గం ఉంది. జిల్లా సరిహద్దులను ఆనుకుని ఉన్న మహారాష్ట్ర ప్రాంతం ఎక్కువగా అటవీ ప్రాంతమే ఉంది. తెలంగాణ, మహారాష్ట్రలను కలిపే జిల్లా సరిహద్దు ప్రాంతం ప్రాణహిత నది పరీవాహకంలో అభయారణ్యాలు ఉన్నాయి. దీంతో శాంతిభద్రతల పరంగా ఈ ప్రాంతం కీలకంగా మారింది. సరిహద్దుకిరువైపులా ప్రాంతాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పరిగణలో ఉన్నాయి. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లో గతంలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు, ఘటనలు చోటు చేసుకున్నాయి. గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు పార్టీ ఉనికిని చాటుతూనే ఉంది. కుమురం భీం జిల్లాలో మావోల ఉనికి లేకున్నా.. ప్రభావం మాత్రం పూర్తిగా పోలేదని పోలీసులు అంటున్నారు.

వరుస ఘటనలు..

మహారాష్ట్రలోని మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో తెలంగాణ వ్యక్తులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. శాంతిభద్రతల రక్షణపై ఇరు రాష్ట్రాలు దృష్టి సారించాల్సిన పరిస్థితి. 20 రోజుల వ్యవధిలో మన జిల్లాకు సమీపంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో మూడు ఎన్‌కౌంటర్లు నమోదయ్యాయి. వీటిలో రేపన్‌పల్లి సమీపంలోని కొలమార్క అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ మన సరిహద్దుకు అత్యంత దగ్గరగా ఉండడం గమనార్హం. ఈ ఎన్‌కౌంటర్‌లో కేబీఎం(కుమురంభీం మంచిర్యాల కమిటీ) కీలక సభ్యులు మృతి చెందగా.. వీరు తెలంగాణ నుంచే ప్రాణహిత నది దాటి మహారాష్ట్రకు వెళ్లారని పోలీసులు ప్రకటించడం తాజాగా హైఅలర్ట్ పరిస్థితిని తెలియజేస్తోంది.

ఇటీవల ఎన్‌కౌంటర్లు

- మార్చి 19న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా రేపన్‌పల్లి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ సరిహద్దుల సమీపంలోని కొలమార్క అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కుమురం భీం మంచిర్యాల కమిటీ సభ్యుడు వర్గీస్ కోయ అలియాస్ మంగులు, సిర్పూర్- చెన్నూర్ ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు కుర్సంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ మరణించారు.
- మార్చి 24న చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి చెందాడు. మృతుడు గంగలూరు ఏరియా కమిటీ సభ్యునిగా భద్రతా దళాలు గుర్తించాయి.
- మార్చి 27న బీజాపూర్ జిల్లాలోని చీకూర్‌బట్టి- పూసుబాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు.

శాంతిభద్రతల రక్షణ

జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. శాంతిభద్రతల రక్షణకు సీఆర్‌పీఎఫ్ పోలీసులు 80మంది, ప్రత్యేక పోలీసులు 40 మంది విధులు నిర్వహిస్తున్నారు. గుర్తించిన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నాం. ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. బలగాలతో కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం.

– కరుణాకర్, కాగజ్‌నగర్ డీఎస్పీ

వరుస సమావేశాలు



కౌటాలలో సమావేశమైన రాజూరా, కాగజ్‌నగర్ ఎస్డీపీవోలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సున్నితమైన సరిహద్దు కలిగి ఉన్న జిల్లాలో మావోయిస్టులతో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రేపన్‌పల్లి సమీపంలో జరిగిన ఘటనలో తెలంగాణ పోలీసులు, ప్రభుత్వానిదే బాధ్యత అని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. గడ్చిరోలి జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ హాజరయ్యారు. మావోయిస్టు సమస్య ప్రధానంగా సమావేశం నిర్వహించారు. చెక్‌పోస్టుల ఏర్పాటు, సరిహద్దుల వద్ద భద్రత, సమాచార మార్పిడి, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రకటించారు. తాజాగా కౌటాల సర్కిల్ కార్యాలయంలోనూ కాగజ్‌నగర్ ఎస్డీపీవో కరుణాకర్, రాజూరా ఎస్డీపీవోల ఆధ్వర్యంలో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులు రాకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్లు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించామని తెలిపారు. మండలానికి ఒకటి చొప్పున వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, మిగిలిన కేంద్రాలను ఈ నెల 8 వరకు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వీసీలో డీఈవో అశోక్, డీఆర్డీవో సురేందర్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం తదితరులు పాల్గొన్నారు.

అధికార ప్రతినిధిగా రాంబాబు

కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా మార్త రాంబాబును నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ నమ్మకంతో అధిష్టానం ఇచ్చిన బాధ్యత నెరవేరుస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు రెడీ

- తొమ్మిది మండలాల్లో ప్రారంభం
- 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ కోసం ముందుగానే తొమ్మిది కొనుగోలు కేంద్రాలను సోమవారం నుంచి ప్రారంభించారు. కేంద్రాలకు వచ్చే ధాన్యానికి అనుగుణంగా వీటి సంఖ్య పెంచనున్నారు. పంట చేతికందే లోపే వరి సాగు చేసే ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉండేలా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులతో ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్రాల ఏర్పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేకరించాల్సిన ధాన్యం లక్ష్యంపై జిల్లా ఉన్నతాధికారులు చర్చించారు.

సేకరణ లక్ష్యం 25వేల మెట్రిక్ టన్నులు

జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 25వేల మెట్రిక్ టన్నుల యాసంగి వరి ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. బోర్లు, వాగులు, వట్టివాగు, పీపీరావు వంటి ప్రాజెక్టుల కింద జిల్లా వ్యాప్తంగా 16,265 ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం అధిక శాతం వరి పంటలన్నీ పొట్టదశను దాటి గొలక ఎండే దశలో ఉన్నాయి. వర్షాకాలం వివిధ కారణాలతో కోతలు సకాలంలో పూర్తి కాక అలస్యంగా యాసంగి సాగు చేపట్టిన రైతుల పొలాలు మాత్రం పొట్ట దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన వరి మరో 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉండగా, మిగిలినవి నెలన్నర రోజుల్లో కోతలు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ధాన్యం రైతుల చేతికందే సమయానికి కేంద్రాలు సిద్ధంగా ఉంచాలనే లక్ష్యంతో మండలానికి ఒకటి చొప్పున ముందస్తుగా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

'హమాలీ' భారం మోయాల్సిందేనా?

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో మొత్తం 37 కేంద్రాలు చేయనున్నారు. ఇందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 31, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 6 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రెబ్బెన, దహెగాం, కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండానే అధికారులే ప్రారంభించారు. ఎప్పటిలాగే ధాన్యం నాణ్యత, తేమ శాతం పరిశీలించాల్సిన బాధ్యతను వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించారు. ఏఈవో పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే కొనుగోలు చేస్తారు. ఏ గ్రేడు ధాన్యం క్వింటాలుకు రూ.2,203, సాధారణరకం క్వింటాల్‌కు రూ.2183 వరకు చెల్లిస్తారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఖర్చులు రైతులకు భారంగా మారనున్నాయి. వాస్తవానికి కేంద్రానికి తరలించిన ధాన్యం తూకం వేయించడంతోపాటు బస్తాలను లారీల్లో లోడింగ్ చేయించడం వంటి ఖర్చులు ప్రభుత్వమే భరించాలి. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వం హమాలీ ఖర్చులను రైతులకు చెల్లించడం లేదు. హమాలీలు 40 కిలోల బస్తాల్లో ధాన్యాన్ని నింపితే బస్తాకు రూ.20 చొప్పున తీసుకుంటారు. అన్నదాతలు క్వింటాల్‌కు రూ.50 వరకు హమాలీ ఖర్చుల రూపంలో భరించాల్సి వస్తోంది. అలాగే ధాన్యాన్ని తరలించే లారీ డ్రైవర్ల బత్త పేరుతో మరికొంత చెల్లించాల్సి వస్తోంది.

తేమ 17 శాతం మించొద్దు

యాసంగి వరి ధాన్యం సేకరణకు ప్రభుత్వ ఆదేశాలతో ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు పండించిన ధాన్యం చేతికందేందుకు మరో నెల రోజుల సమయం పడుతుంది. మద్దతు ధర దక్కాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. తేమ 17 శాతానికి మించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– రబ్బానీ, డీసీవోప

అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతాం

- పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వెనుకబాటు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్: జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాంబ్లె అనిల్ నివాసంలో సోమవారం అల్పాహారం చేసిన అనంతరం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో జిల్లా అభివృద్ధిలో అట్టడుగుకి చేరిందని ఆరోపించారు. ప్రాణహిత, కుమురం భీం, వట్టివాగు, కడెం, కుప్టి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరందించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామన్నారు. వంతెనలు నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కాగజ్‌నగర్ మండలం అందవెల్లి బ్రిడ్జి, ఆసిఫాబాద్ మండలం గుండి బ్రిడ్జితోపాటు అసంపూర్తిగా ఉన్న వంతెనలు నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా అభివృద్ధి బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇప్పటివరకు ఎనిమిది సార్లు జిల్లాకు వచ్చానని, రెండుసార్లు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించానని పేర్కొన్నారు. జోడేఘాట్, మార్లవాయి, శంకర్‌లొద్ది, బుద్ధ విగ్రహం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు టైగర్‌జోన్, వైల్డ్ లైఫ్ యాక్ట్‌తో ఇబ్బంది పడుతున్నారని, అడవులు, జంతువులు కాపాడటంతోపాటు మనుషుల భద్రత కూడా ముఖ్యమన్నారు. పోడు రైతులకు పట్టాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రాహుల్‌ది త్యాగాల కుటుంబం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీది కుటుంబ పార్టీ కాదని, త్యాగాల కుటుంబమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీ, సంత్ సేవాలాల్, ఏకలవ్య కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీకి ప్రధాన మంత్రిగా అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, ఓయూ జేఏసీ నాయకులు కాంబ్లె అనిల్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, డీఆర్డీవో సురేందర్‌తో కలిసి విద్యాశాఖ, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో చేపట్టాల్సిన పనులపై ఎంపీడీవో, ఏఈ, హెచ్‌ఎం, ఎంఈవో, కమిటీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సెమినార్ ఏర్పాటు చేసి అభివృద్ధి పనుల గురించి వివరించాలని ఆదేశించారు. భవనాలు, మూత్రశాలల మరమ్మతులు, విద్యుత్, ఇతర పనులు విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ పాఠశాల కమిటీ పేరిట బ్యాంకు ఖాతా తెరవాలని సూచించారు.

పోలింగ్ అధికారులకు అవగాహన అవసరం

- బాధ్యతతో విధులు నిర్వర్తించాలి
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన అవసరమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో సోమవారం పోలింగ్ అధికారుల, సహాయ పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఎన్నికల విధులపై సలహాలు, సూచనలు అందించారు. పీవో డైరీ, 17సీపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించి వీవీప్యాట్‌లలో ఉండే స్లిప్‌లు ప్రత్యేక కవర్‌లో ఉంచాలన్నారు. వారి సమక్షంలోనే ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై సీల్ వేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునేందుకు ఫామ్ 12 సమర్పించాలన్నారు. సమస్యలు ఉంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఓటర్లకు వసతులు కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీవోలు ఏ మాత్రం కంగారు పడకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పోలింగ్ సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఫ్యాన్‌లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు చర్యలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సోమవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ కోర్టు పరిధిలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి నగేష్, మహిళా ప్రతినిధి రాపర్తి గాయత్రి మధురిమ, కమిటీ సభ్యులు విద్యాసాగర్, రాజేశ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ న్యాయవాది జగన్‌మోహన్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం బస్టాండ్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై రాములు తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన చింత ప్రదీప్, రేవెల్లి దినకర్ బైక్‌పై బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

ప్రాణహితలో దూకి యువకుడి ఆత్మహత్య


ఉమేష్(ఫైల్)

బెజ్జూర్: ప్రాణహితలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సాధిక్ పాషా తెలిపారు. బెజ్జూర్ మండలం బారెగూడెంకు చెందిన మురుమురే ఉమేష్ (25) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. లంబాడిగూడ ప్రాణహిత కెనాల్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఘటన స్థలాన్ని సందర్శించారు. దుస్తులు, చెప్పుల ఆధారంగా బారెగూడెం వాసిగా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడని తల్లి సరోజ తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


అజ్గర్‌అలీ (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): ఈ నెల 30న అదృశ్యమైన వ్యక్తి మృతదేహం సోమవారం లభించింది. తాండూర్ ఐబీ సుభద్రకాలనీకి చెందిన ఎండీ. అజ్గర్ అలీ (33) ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్బాపూర్ ఓసీపీ ప్రాజెక్టు పరిసరాల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న సీఐ, ఎస్సైలు కుమారస్వామి, జగదీష్‌గౌడ్ ఘటనాస్థలికి అజ్గర్ అలీ కుటుంబ సభ్యులను తీసుకెళ్లి చూపించారు. మృతుని చేతికి ఉన్న తాడు ఆధారంగా తనభర్త అజ్గర్ అలీనేనని అతని భార్య హర్షియా బేగం గుర్తించారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతునిది హత్యా? ఆత్మహత్యా? తేలాల్సి ఉంది.

బొలెరో వాహనాలు ఢీ..

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని లింగాపూర్ పాల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి రెండు బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. టైల్స్‌లోడ్‌తో మేదరిపేట వైపు నుంచి కళాపెల్లి వెళ్తున్న బొలెరో జన్నారం నుంచి లక్సెట్టిపేట వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న మరో బొలెరో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

- జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం

మంచిర్యాలటౌన్: వేసవికాలంలో మార్చినుంచే ఎండలు మండుతుండడంతో జనం ముస్ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.

ఎల్లో అలర్ట్..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.


జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా లక్ష్మీ థియేటర్ చౌరస్తా

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన/చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి.
- ఆల్కాహాల్/సిగరేట్/కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండండి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించండి.
- వేసవిలో ఉదయం/సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిది.

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలి.
- మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి.
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు, కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

బయటకు వెళ్లొద్దు



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపీ ధరించి వెళ్లాలి. చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే లవణాలతో కూడిన ద్రావణం తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

అధికారులకు కోర్టు నోటీసులు

నెన్నెల(బెల్లంపల్లి): జెండావెంకటాపూర్‌లోని గోపి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా చేపలు పట్టుకునే టెండర్‌ను అప్పగించిన అధికారులకు బెల్లంపల్లి కోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. టెండర్ ఖరారు చేయడంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని జెండా వెంకటాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఏస్కూరి లచ్చయ్య మార్చి 11న బెల్లంపల్లి లీగల్ సర్వీస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో, ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్లు ఏప్రిల్ 6న కోర్టులో హాజరుకావాలని నోటీసులు జారీ అయ్యాయి. ఏటా రూ.2 లక్షలకుపైగా టెండర్ పాడే చెరువుకు జీపీ తీర్మాణం లేకుండానే కేవలం రూ.9 వేలకే అప్పగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు వివరించారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం


కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారి మహేశ్

ఆసిఫాబాద్: బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ అన్నారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం మండలంలోని పర్శనంబాలకు వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు, కులపెద్దలకు కౌన్సిలింగ్ నిర్వహించి వివాహాన్ని వాయిదా వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చట్టపరమైన ఇబ్బందులతో పాటు ఆరోగ్య పరమైన సమస్యలు వస్తాయన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట రక్ష భవన్ సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవళి ఉన్నారు.

వివాదాస్పద భూముల్లో హద్దురాళ్లు అడ్డుకున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో

భీమారం(చెన్నూర్): మండలంలోని అంకూసాపూర్ శివారులోని వివాదాస్పద భూముల్లో సోమవారం మంచిర్యాల ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు నేతృత్వంలో అటవీశాఖ సిబ్బంది హద్దురాళ్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. అంకూసాపూర్ శివారు అటవీ ప్రాంతంలో 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు గత ప్రభుత్వ హయాంలో అటవీశాఖ సర్వే జరిపి తమకు రసీదులు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం వచ్చేవరకు ఆ భూముల్లోకి రామని చెప్పిన అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి హద్దురాళ్లు వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో అటవీశాఖ అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాములు ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేచిని రైల్వేస్టేషన్‌లో నో హాల్టింగ్

- మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 30 వరకు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత


రేచిని రోడ్ రైల్వే స్టేషన్

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ అలంకార ప్రాయంగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైలు కూడా ఈ రైల్వేస్టేషన్‌లో ఆగడం లేదు. స్టేషన్ మరమ్మతులు, మూడోలైన్ పనుల దృష్ట్యా పలు రైళ్ల హాల్టింగ్‌లను ఏప్రిల్ 30 వరకు ఎత్తివేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని నెలలుగా దశల వారీగా ఒక్కో రైలు హాల్టింగ్ ఎత్తివేస్తూ వస్తున్నారు. ఇటీవలి కాలంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ప్రయాణికులకు ఈ రైల్వే స్టేషన్‌లో సేవలు అందిస్తుండగా ప్రస్తుతం ఆ సేవలు కూడా నిలిచిపోయాయి. కరీంనగర్–సిర్పూర్ కాగజ్‌నగర్ (పుష్పుల్–07765), హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్–17011), సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్–17233) రైళ్లు అప్ అండ్ డౌన్ హాల్టింగ్‌లు ఈ నెలాఖరు వరకు నిలిచిపోనున్నాయి. దీంతో రైలు ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో బెల్లంపల్లికి వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

పాల కోసం వెళ్తూ పరలోకానికి

- కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దండేపల్లి(మంచిర్యాల): పాలకోసం వెళ్తున్న వ్యక్తిని కారు రూపంలో వచ్చిన మృత్యువు వెంబడించడంతో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు దండేపల్లి మండలం మాకులపేటకు చెందిన కొత్తపల్లి రాజేశం (62) సోమవారం ఉదయం పాలు తెచ్చేందుకు స్కూటీపై తాళ్లపేటకు వెళ్తుండగా నాగసముద్రం సమీపంలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఘటనలో రాజేశంకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా కేంద్రం కింద స్ట్రింగర్ల ఎంప్యానల్‌మెంట్ కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎన్‌యూ, హెడ్, సంచాలకులు (వార్తలు) రాహుల్ గొలీకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 30 వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థులు దరఖాస్తు డిమాండ్ డ్రాఫ్ట్, అనుబంధ పత్రాలతో జతపరిచి గడువులోగా అందించాలన్నారు. మరిన్ని వివరాలకు www.prasarbharati.gov.in/pbvacancies వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చన్నారు.

4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన వివిధ విభాగాల్లో పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులకు ఈనెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్స్–22, అసోసియేట్ ప్రొఫెసర్లు–27, అసిస్టెంట్ ప్రొఫెసర్స్–45, సీనియర్ రెసిడెంట్స్–21, అనాటమీ, ఫిజియోలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయోలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనరాలజీ, సైకియాట్రి, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మజీ, ఆర్థోపెడిక్స్, అబ్‌స్ట్రెటిక్స్, గైనకాలజీ, అనస్తీసియా, రేడియాలజీ విభాగాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ ప్రతులను జతపర్చి ఈ నెల 4న సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు www.gmckumurambheemasifabad.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కాండ్లి గ్రామానికి చెందిన గణేశ్(45) సోమవారం రాత్రి భైంసాకు వస్తున్నాడు. మండలంలోని టాక్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోలిండియా పోటీలకు ఎంపిక


రవికుమార్

మందమర్రిరూరల్: ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఎన్సీఎల్‌లో జరిగే కోలిండియా కబడ్డీ పోటీలకు మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్‌లో శాంప్లింగ్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఏరియా జీఎం మనోహర్ అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి సింగరేణికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.


సమష్టి కృషితోనే ఉత్పత్తి లక్ష్యసాధన

మందమర్రిరూరల్(చెన్నూర్): ఉద్యోగుల సమష్టి కృషితోనే గత ఆర్థిక సంవత్సరం సంస్థ ఏరియాలోని కేకే–5 గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 98 శాతం సాధించామని గని మేనేజర్ అల్లావుద్దీన్ అన్నారు. సోమవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగస్వాములైన ఉద్యోగులను అభినందించారు. సమావేశంలో సేఫ్టీ ఆఫీసర్ రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, గుర్తింపు సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో 89 శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియా 89 శాతం లక్ష్యాన్ని నమోదు చేసుకుంది. మార్చి 31 నాటికి ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఏరియాలోని అన్ని గనులకు కలిపి మొత్తం 66.4 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 59 లక్షల టన్నులు సాధించింది. దీంతో 11 శాతం ఉత్పత్తిని తీయలేకపోయింది. మార్చిలో 5.6 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 6 లక్షల టన్నులు సాధించి 120 శాతం నమోదు చేసుకుంది. ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే న్యూటెక్ గనుల మాత్రమే వందశాతం లక్ష్యాలను సాధించినట్లు కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

మంచిర్యాలక్రైం: పార్లమెంటు ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఏ పార్టీకి చెందిన వారైనా, ఎంతటి వారైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, మైక్ పర్మిషన్, సభలు, సమావేశాల కోసం సువిధ యాప్ ద్వారా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ ఎస్సైలు పాల్గొన్నారు.

గుర్తింపుపత్రం జాప్యానికి కారణం ఏఐటీయూసీ

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు


మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఎన్నికల్లో గెలిచినా ఇప్పటికీ గుర్తింపు పత్రం రాకపోవడానికి కారణం గెలిచిన ఏఐటీయూసీనేనని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలే అని, దీనిపై గతంలో ఆర్ఎల్సీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఐదు సంఘాలు కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ఇప్పుడు నాలుగేళ్లు ఉండాలని కోరుతూ సీఎల్సీకి ఏఐటీయూసీ లేఖ రాసిందన్నారు. అక్కడి నుంచి సమాధానం వచ్చేంత వరకు గుర్తింపు పత్రం తీసుకోవద్దనే ఉద్దేశంతో ఉందన్నారు. అందుకే గుర్తింపు పత్రం తీసుకోవడం లేదన్నారు. కానీ అన్ని రకాలుగా గుర్తింపు హోదాలో చలామణి అవుతోందన్నారు. సింగరేణిలో ఎంపీ ఎన్నికల పేరుతో బదిలీలను ఆపేశారని, కానీ పైరవీలు కేసులకు మాత్రం ఇది వర్తించడం లేదన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి, బ్రాంచి అధ్యక్షుడు గుల్లా బాలాజీ, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, అంబాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


విజేతలకు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే

భీమారం(చెన్నూర్): గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన కాకా వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ మండల కేంద్రంలో స్టేడియం నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పోటీల్లో భీమారం జట్టు ప్రథమ, మిట్టపల్లి జట్టు ద్వితీయ బహుమతులు సాధించగా వారికి మెమెంటోతో పాటు నగదు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, పోటు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


అవగాహన కల్పిస్తున్న జయదీప్ పాటిల్

తాండూర్(బెల్లంపల్లి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మల్టీ స్టేట్ కోఆపరేటివ్ నేషనల్ ఫిషరీస్ అధ్యక్షుడు జయదీప్ పాటిల్ అన్నారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలో మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి మత్స్యకారులకు వివరించారు. సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుంటేనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీ స్టేట్ కోఆపరేటివ్ జిల్లా అధ్యక్షుడు పూలబోయిన భీమన్న, ఫిషరీస్ జిల్లా వైస్ చైర్మన్ కంపెల చిన్నయ్య, తాండూర్ కోఆర్డినేటర్ రెవెల్లి శ్రీనివాస్, మత్స్యకారులు పెద్దబోయిన మహేష్, కంపెల శ్రీనివాస్, పెద్దబోయిన శంకర్, పెద్దబోయిన రవి, ఉప్పుట్ల చంద్రశేఖర్, ఉప్పర్ల సంతోష్, మేడి శంకర్, మేడి సునీత, మేడి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి


మాట్లాడుతున్న అధికారి రాహుల్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్ సూచించారు. సోమవారం బెల్లంపల్లిలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 18న జారీ అవుతుందని, నోటిఫికేషన్ విడుదల కాగానే ఎన్నికల తంతు ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరాల స్వీకరణ, ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల జాబితా వెల్లడించాల్సి ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఆ తీరుగా ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు, సిబ్బంది సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.